# 36. ఏలినవారు కులాసా

"పురపాలక సంఘము.

12,13వ వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టరు వారి కార్యాలయము"

అని ఉంది ఆ బోర్డు.

"వారు" ఇంకా ఆఫీసుకి రాలేనట్టుంది.

కాకీ బట్టలు ధరించిన ఒక ముసలి ఉద్యోగి "ఐగారొచ్చే యాలయింది. లోన బెంచీ మీద కూకోండి." అన్నాడు నాకొక 'సలాం' కొట్టి.

శానిటరీ ఇన్‌స్పెక్టరు వారు వస్తూనే 'ఏరా సిమ్మాద్రీ ! పది గంటలైంది టైమ్. ఇంతవరకూ టేబిలూ కుర్చీ తుడవడానికి కూడా తీరుబాటవలేదా నీకు? రాన్రానూ నీకు కళ్లు నెత్తిమీది కొస్తున్నాయిరే' అని కుర్చీని తన జేబురుమాలుతో దులుపుకుని కూర్చున్నారు.

'ఇందాకోసారి దులిపాడండి' అన్నాను మాట కలపాలని.

'మీరెవరు?' అన్నాడాయన; నేను వాణ్ణేదో అడుగుతూంటే చెప్పడానికి మధ్యని నువ్వెవరు అన్న ధోరణిలో.

'నాపేరు వై.వి. సుబ్బారావండి. ఈ పక్కని జవహర్ నగర్ అవతల కొణిసి వీధిలో ఉంటాను. చంద్రా అండ్‌కో అని లారీ సప్లయి ఆఫీసులో గుమస్తాగా పనిచేస్తున్నాను'

'చెప్పు !' అన్నాడాయన, టేబిలు కింద ఉన్న కర్ర బద్దీకి కాళ్లు దన్నిపెట్టి కుర్చీలో వెనక్కీ ముందుకీ వూగుతూ.

'మా వీధిలో పదేళ్ల నుంచి ఓ కిరాణా కొట్టుందండి. అందులో క్రమంగా పాలపొట్లాలు, కోడిగుడ్లూ అమ్మడం మొదలెట్టేరండి. ఏడాది కిందట్నించీ డ్రస్సుడు చికెనూ బ్రాయిలర్ చికెనూ అమ్ముతున్నారండి. నాలుగు నెల్లనుంచీ వీధి మధ్యని ఒక మాను ముక్క నిలబెట్టి గొర్రెమాంసం మేక మాంసం అమ్ముతున్నారండి'

'వాళ్లేవో అమ్ముకుంటే నీకేం?'

'మాంసం ఉన్నచోట దుమ్ములుంటాయి కదండి, మా వీధిలో గాని దగ్గిర్లో ఎక్కడా గాని చెత్త కుండీ లేదండి. అసలే వీధి మధ్యగా అడ్డదిడ్డంగా పారే కుళ్లుకాలవ. అందులో ఈ ఎముకలు కొరకడానికి వచ్చే కుక్కలు. రోజు రోజుకీ కంపు ఎక్కువవుతోంది. మీ వాళ్లని పంపించి కాలవల్లో కొంచెం బ్లీచింగు పొడరు కొట్టిస్తారని-'

'అప్లికేషను రాయాలి!'

'అప్లికేషను ఎలా రాయాలండీ?'

'హుం! ఖర్మ!!' అని డ్రాయరు సొరుగు లాగి అందులో ఉన్న కాగితాల బొత్తిలోంచి ఒక కాగితం లాగాడు. 'ఇలాగ!' అని నాకిచ్చాడు.

'మహారాజశ్రీ - పురపాలక సంఘము 12,13 వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టరు వారి దివ్య

సముఖమునకు-' అని మొదలైంది ఆ అప్లికేషన్. 13వ వార్డులో మూడు రోజుల కిందటి నుండి ఒక ఖాళీస్థలంలో ఒక ఎద్దు చచ్చిపడి ఉంది. దాన్ని ఎవరూ తొలగించలేదు. కంపు, ఈగలు, రాబందులు, అంటు వ్యాధుల భయం.--'' ఇంకా ఏదో వుంది అందులో.

'అప్లికేషన్ మీద వీధిలో అందరి సంతకాలూ పెట్టించు. రేపూ, ఎల్లుండీ సెలవు, అవతలెల్లుండి పట్రా!' అన్నారు శానిటరీ ఇన్‌స్పెక్టరు వారు.

మా ఇంటికీ మాంసం కొట్టుకీ మధ్య కాపరం ఉంటున్న మోహనరావుతో చర్చించేను. 'వీధుల్ని క్లీన్ చేయించే అధికారే కావచ్చు కాని 'మహారాజశ్రీ'లు 'దివ్యసముఖాలు' ఎందుకు? ఇంగ్లీషులో రాస్తే చక్కగా టు ది శానిటరీ ఇన్‌స్పెక్టరు అని రాయొచ్చు' అన్నాను.

'ఇంగ్లీషులో రాస్తే అందులో ఏం రాశావో అని ఎవరూ సంతకాలు చెయ్యరు, పైగా అప్లికేషన్‌ల దగ్గరనుంచి ఆర్డర్స్ దాకా జిల్లా స్థాయిలో తెలుగులోనే ఉండాలంటోంది ప్రభుత్వం' అన్నాడు మోహనరావు.

మధ్యేమార్గంగా పైని అడ్రస్ టుది శానిటరీ ఇన్‌స్పెక్టర్ అని ఇంగ్లీషులో రాసి దరఖాస్తు అంతా తెలుగులో రాసేను. 'కార్బన్ పెట్టి మూడో నాలుగో కాపీలు చెయ్యి. కమీషనర్‌కీ హెల్త్ ఆఫీసర్‌కీ పంపొచ్చు.' అన్నాడు మోహనరావు.

"శానిటరీ ఇన్‌స్పెక్టరు వారు" వారం అయినా రాలేదు. ఎనిమిదో రోజున ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక సాధారణ పోలీసు వచ్చారు,. 'ఎవరండీ ఇక్కడ వై.వి. సుబ్బారావు? ఇక్కడేదో మాంసం దుకాణం ఉందని రిపోర్టు చేసింది నువ్వేనా?'

'మేం పోలీసు రిపోర్టేమీ ఇవ్వలేదే!' అన్నాను.

'నువ్వు కమీషనర్ కేసిన కాపీ మా డిఎస్పీ దొరకొచ్చింది. యంక్వైర్ జెయ్యమని ఆర్డరైంది. నడు, మాంసం కొట్టు సూపించు.'

'మాంసం కొట్టూ చేపల కొట్టూ ఒకరు చూపించేదేంటి? వాసన్ని బట్టి కనిపెట్టేయొచ్చు కదా. నాలుగడుగులెల్లండి, అదే కనబడుతుంది' అన్నాను.

'వాసన్ని బట్టి పసిగట్టేడానికి మేమేం కుక్కల్లా కనిపిస్తున్నామేంటి, నీ కంటికి? నడు నడు!'

రషీదుని ఇంట్లోంచి ఇవతలికి లాగారు. క్షణాల మీద 'లయిసెన్సు లేకుండ మాంసం కొట్టెడతావట్రా లంజాకొడకా?' కిరానా కొట్టెట్టి అందులోనే పాలు, అందులోనే గుడ్లూ, అందులోనే మాంసం అమ్ముతావురా లమ్డీకే?' అని రషీదుని నోటితోనూ లాఠీతోను సన్మానించేరు పెద్ద పోలీసుగారు.

రషీదు దెబ్బలు తప్పించుకోడానికి ఇటూ అటూ పరిగెడుతూ ఉంటే చిన్న పోలీసాయన రషీదు తప్పించుకు పారిపోకుండా అడ్డుతున్నాడు. రషీదు భార్య: అమ్మో, బాబో-అని కేకలు పెడుతూ ఎప్పటికప్పుడు లాఠీకీ రషీదుకీ మధ్యకొచ్చేస్తూ తనకి దెబ్బలు తగిలినా మొగుడికి తగలకుండా అడ్డుకుంటోంది. నిమిషానికి రెండుసార్లు, రషీదు లంజకొడుకు, లమ్డీకొడుకు, పుండాఖోరు, భడాచోరు, బాంఛేతూ, గాడిదకొడుకు ఏమిటేమిటో అయిపోతున్నాడు.

మోహనరావు వెళ్లి పెద్ద పోలీసు చేతిలో ఉన్న లాఠీని ఒడుపుగా పట్టుకుని 'ఆగండి' అని కేకేశాడు. 'ఇదేం లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం కాద్సార్, వీథి క్లీన్ చేయించమని శానిటరీ ఇన్స్పెక్టర్‌కి రాస్తే మీరొచ్చి అనవసరంగా చెయ్యి చేసుకుంటున్నారు' అన్నాడు.

'లా ఎండ్ ఆర్డరు ప్రాబ్లమేమిటో న్యూసెన్సేటో నువు జెప్తే గాని మాకు తెల్దేటి? మాడూటీ మేం జేయకంటా అడ్డొచ్చేవని రిపోర్ట్ రాస్తే ఆడికన్నా ముందు నువ్వే బొక్కలో కెలిపోగలవు!'

నేను రషీద్ ఇంట్లోకెళ్లి ఒకస్టూలు, ఒక కుర్చీ తెచ్చి వీథిలో వేసేను. కాగితం పెన్ను అందించేను. టీ చేసి పట్రా-అని రషీదు పెళ్లానికి పురమాయించేను.

'ప్రజలు కట్టే పన్నుల్లోంచి జీతాలు తీసుకుంటున్న వాళ్లూ ప్రజల వోట్లతో పదవుల్లోకి వచ్చేవాళ్లూ నిజానికి ప్రజల సేవకులు అనిపించుకుంటారు. పబ్లిక్ సర్వెంట్, గవర్నమెంట్ సర్వెంట్ అనే మాటలున్నాయి. ప్రజా సేవకుడు అనే మాట ఉంది. అవన్నీ మర్చిపోయి ఈ ఉద్యోగస్తులంతా ప్రజల్ని సామాన్య పౌరుల్ని ఇలా అవమానపరుస్తారెందుకో అర్థం కాదు. ఇన్స్పెక్టర్ 'వారి' కార్యాలయం అని బోర్డు, 'మహారాజశ్రీ' అంటూ అప్లికేషన్లు ప్రజల్లో అందరూ లంజా కొడుకులూ గాడిద కొడుకులూ. ఇదేం బాగాలేదు, సుబ్బారావు!' అన్నాడుమోహనరావు.

'ఆ బోర్డు చూశాక నేను ఊళ్లో తిరిగాను. జిల్లా కలెక్టర్ కార్యాలయం అని వుంది. రెవెన్యూ డివిజనల్ ఆఫీసు అని ఉంది. మేజిస్ట్రేట్ కోర్టు అని ఉంది. వాళ్లెవరు 'వారు', 'గారు' అని తగిలించుకోలేదు. 'తూనికలు కొలతల ఇన్స్పెక్టరు వారు', 'ఎక్సయిజు ఇన్స్పెక్టరు గారు' ఇలాంటి అధికారులే ఎక్కువగా ఈ గౌరవాన్ని కోరుకుంటూ పౌరుల్ని అగౌరవ పరచడానికి సిద్ధం అవుతున్నారు. రాజకీయ నాయకుల సంగతి వేరు. అవన్నీ గొడుగుల షాపులే. ఏ ఎండకి ఆ గొడుగు పట్టుకోవాలి కదా. ఎలక్షన్లకి ముందు నా ప్రియమైన ప్రజలారా, ఓటరు మహాశయులారా; అంటారు. ఏదైనా మెమోరాండం పట్టుకెళ్తే ఏరా, కళ్లు నెత్తికొచ్చాయా, బొత్తిగా కనపట్టం మానేశావు అంటారు' అని వివరించేను.

'పాపం రషీదు! మనం ఒకటి తలుస్తే అధికార్లు ఇంకొకటి తల్చారు.'

★ ★ ★

ఇప్పుడు-

మా వీధికి అవతలి చివర ఒక చెత్తకుండీ వచ్చింది. అక్కడున్న పెద్ద కుళ్లు కాలవకి సైకిళ్లు, మోపెడ్లు పట్టేటంత వంతెన పడి, అవతలి పేటలో వాళ్లు కూడా మాంసం కొనుక్కోడానికి రషీదు కొట్టుకి రావడానికి వీలయింది.

ఆదివారం ఉదయం తొమ్మిది గంటల వేళప్పుడు ఇద్దరు శాంతి భద్రతల అధికార్లు వచ్చి రషీదుని పలకరించి అతనిచ్చే పొట్లాలు పట్టుకెళ్తారు. 'నీకేం భయం లేదు. ఇక్కడ ముస్లిం కుటుంబం నీ ఒక్కడిదే అని భయపడకు; మేం ఉన్నాం!' అని చెప్పి వెళ్తారు.

బుధవారం ఉదయం ఏడు గంటలకల్లా స్వీపర్స్ బృందం, ఎనిమిదింటికి శానిటరీ ఇన్స్పెక్టరు; వస్తారు. వీథిలో అడ్డదిడ్డంగా పారుతున్న కుళ్లు కాలువలో చిక్కుపడిపోయిన కొబ్బరి చిప్పలు, విస్తరాకులు, అలాంటి చెత్తంతా తొలగించి కుప్పలు పోసి కుండీ కెత్తుతారు. కాలవకి ఇటూ అటూ బ్లీచింగు పౌడరు జల్లుతారు. ఎవరికేం కావలసినా రషీదు కొట్లో

స్వతంత్రంగా నిర్మొహమాటంగా అడిగి పట్టుకెళ్తారు.

పాల పేకెట్ ధర మా వీథిలో బైటకన్నా ఇరవై పైసలెక్కువ. గుడ్డు ఐదు పైసలెక్కువ. మాంసం కేజీమీద రెండు రూపాయలెక్కువ. 'ఎక్కువ ఎక్కువ అనే బదులు బజారుకి పోయి తెచ్చుకోరాదు? మాదగ్గరే కొనమని మిమ్మల్ని మేం బలాత్కారం చేసేమా?' అంటాడొకసారి. 'ఏం చెప్పాలి సార్. పాల క్రేట్లు అంత దూరం పోయి మోసుకొస్తాం కదా. ఆ శ్రమకి ఐదు పైసలు ఇయ్యరా సార్?' అంటాడింకోసారి. 'ఛస్తున్నా ననుకోండి, ఈ చిన్న ఆఫీసర్లని కట్టుకోలేక-' అంటాడు మరోసారి. ★

# 37. దగాపడని తమ్ముడు

"బ్యాంకిలోనూ, రిజిస్ట్రారాఫీసులోనూ, కలెక్టరాఫీసులోనూ ఏవో పన్లున్నాయిట; మా తమ్ముడు ఇరవై తొమ్మిదో తారీకున వస్తానని కబురు చేసేడు. నేను కుటుంబంతో సహా తిరుపతి వెళ్తున్నాను. అంచేత నిన్ను కలవమన్నాను. రెండురోజులు సెలవు పెట్టయినా సరే వాడి పన్లు అయ్యేటట్టు చూడు; లేకపోతే వాడితో లేనిపోని గొడవ!" అని చెప్పేసి అప్పారావు వెళ్లేడు. సరేలే-అన్నాను.

" మీ పలుకుబడివల్ల నా పనులన్నీ సక్రమంగా జరిగిపోయాయి. రెండురోజులు సెలవైతే పెట్టేరుగాని ఈ ఆఫీసుల చుట్టూ తిరగడంతో మీకు నానాయాతనా ఐంది. రేపూ ఎల్లుండీ మీకు సెలవు దినాలు కనక నాతో మావూరొచ్చీండి. మిమ్మల్ని సత్కరిస్తాను" అన్నాడు సింహాచలం.

"మన్లో మనకి సన్మానాలూ సత్కారాలూ ఎందుకు? నాకు మీ అన్నయ్య ఎంతో మీరూ అంతే. ఇదే మీ అన్నయ్యయితే మీ సత్కారానికి ఆశిస్తాడేమిటి?" అన్నాను.

"మా అన్నయ్యకి నా సత్కారం ఒక్కటీ తక్కువొచ్చిందా యేమిటి? ఏదో పల్లెటూరి వాళ్లం, మమ్మల్ని పట్నం బాబులు దగాచేస్తూనే ఉంటారు. మీరు ఆదుకున్నారు గనకా సరిపోయింది. పదండి, పదండి!" అన్నాడు సింహాచలం.

ఆ విధంగా వెళ్లేను, ఆ పల్లెటూరికి. రోడ్డుమీద ఉన్న ఓ వూళ్లో బస్సు దిగగానే అక్కడున్న ఒక టీ దుకాణంలో నన్ను కూర్చోబెట్టి, ఎవరింటికో వెళ్లి, తను రెండురోజుల కిందట అక్కడ దాచిన బులెట్టు మోటారు సైకిల్ తెచ్చేడు. దానిమీద కూర్చోబెట్టి నాలుగు మైళ్ల బ్రాంచి రోడ్డుమీద తీసికెళ్లాడు, వాళ్లవూరికి.

పల్లెటూరంటే పూరిగుడిసెలూ, అనారోగ్యం, అవిద్య, సదుపాయాలలేమి-అని నాకు భయం. కాని సింహాచలం నన్ను తీసికెళ్లిన ఆ వూళ్లో పూరిగుడిసెలు పట్టణాల్లో మురికి వాడలకన్నా శుభ్రంగా ఉన్నాయి. రోడ్డు పడ్డాది, కరెంటుంది. సందు సందుకీ గొట్టాం బావులున్నాయి. సింహాచలం ఇల్లయితే మరీ బావుంది. అర ఎకరం స్థలంలో రెండు వాసల్లో పెంకుటిల్లు అది. ముందు వాసలో ఒక భాగం డాబా, అక్కడొక గది. నుయ్యి, పంపు సెట్టు ఓవర్ హెడ్డు టాంకి, కరెంటు ఆగిపోతే జనరేటరు. పశువుల సాల విడిగా ఉంది. అందులో